సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 3 । ఆగస్టు । 2023



నేటి నుంచి బ్యాడ్మింటన్ సంబరం

కడపలో ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. -8లో..



దేశానికే ఆదర్శంగా జగన్ పథకాలు

సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34.7/27.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.5 – 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 20.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

శరవేగంగా పింఛన్ల పంపిణీ

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ పంపిణీ కింద జిల్లాలో వలంటీర్ల ద్వారా శరవేగంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియ సాగుతోంది. మొత్తం 2,51,420 మందికి రూ.69,37,06,750 పంపిణీ చేయాలి. రెండో రోజైన బుధవారం నాటికి 2,12,524 మందికి రూ 64,14,79,750 పంపిణీ చేశారు. దీంతో పంఛన్ల పంపిణీ 92.48 శాతం నమోదైంది. త్వరితగతిన పింఛన్లను పంపిణీ చేయడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సబ్సిడీ టమాటాల రాక

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తున్న టమాటాలు గురువారం కడప రైతు బజార్‌కు వస్తున్నట్లు మేనేజర్ నాయక్ తెలిపారు. రెండు టన్నుల టమాటాలను ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. టమాటాల కోసం వచ్చే వినియోగదారులు తప్పని సరిగా ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. ఒక్కొక్కరికి కిలో చొప్పున మాత్రమే ఇస్తామని, కిలో 50 రూపాయలకే అందచేస్తామన్నారు.

కడప హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి



కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా ఎలిమెంటరీ, సెకండరీ టీచర్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా చల్లా విశ్వనాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేస్తున్న లక్ష్మిరాజా రాజీనామా చేయడంతో బుధవారం ఎన్నిక నిర్వహించారు. విశ్వనాథరెడ్డి ఒక్కరే నామినేషన్‌ను దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈయన వీఎన్‌పల్లె మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పబ్బాపురం హౌస్ బిల్డింగ్ సొసైటీకి అనేక సవాళ్లు ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మేలు జాతి దూడల ప్రదర్శన



రైతుకు బహుమతి అందజేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి శారదమ్మ

సిద్దవటం: జాతీయ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిద్దవటం వంతాటిపల్లె గ్రామంలో బుధవారం ఉత్తమ మేలుజాతి పెయ్య దూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీకృత పశుదాణా ఉపయోగించడం వల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. కడప ఉప సంచాలకులు టి.వి. రమణయ్య మాట్లాడుతూ వర్షా కాలంలో పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి తెలియజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, సిద్దవటం సహాయ సంచాలకులు డాక్టర్ లక్ష్మీదేవి మాట్లాడారు. అనంతరం మేలు జాతి పెయ్యదూడల రైతులకు బహుమతులును అందజేశారు.

'ఓపెన్' చాన్స్.. వదలొద్దు

మదనపల్లె సిటీ: చదువు మధ్యలో మానేసిన, ఉత్తీర్ణులు కాకపోయిన వారి విద్యాసక్తిని నెరవేర్చేందుకు 'ఓపెన్ స్కూల్' సువర్ణవకాశం కల్పిస్తోంది. 14 ఏళ్ల నుంచి బడి మధ్యలో మానేసిన వారు సార్వత్రిక పాఠశాలలో చేరి 10వ తరగతి చదువుకునేందుకు అవకాశం ఉంది. అంతేకాక ఇంటర్‌లో చేరి చదువుకునే వెసులుబాటుంది. ఇది వరకు ఇంటర్మీడియట్ చదివి అనుత్తీర్ణులైన, మధ్యలో మానేసినవారు కూడా ఈ విధానంలో పూర్తి చేయవచ్చు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని స్టడీ సెంటర్ల ద్వారా ఏటా వేలాది మంది చదువుకునేందుకు అవకాశం కల్పించారు.

అర్హతలు ఇవీ..

- పదో తరగతి చేరేందుకు ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయో పరిమితి ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేది ధృవీకరణపత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కులధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఆయా అధ్యయన కేంద్రాల్లో కో–ఆర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు.

సౌకర్యాలు టాప్‌క్లాస్



నా పేరు వెంకటసుబ్బారెడ్డి. బద్వేల్ జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. మా పాఠశాలలో 17 వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో తరగతి గదులు సరిపడక ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రభుత్వం స్పందించి మా పాఠశాలకు నాడు- నేడు రెండో విడత కింద రూ. 2.52 కోట్లతో 21 అదనపు తరగతి గదులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఏడు తరగతి గదుల పనులు పూర్తిస్థాయిలో జరిగాయి. మిగతా గదులకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి.రెండు మూడు నెలల్లో ఇవి అందుబాటులోకి వస్తాయి.

- రూ. 296.65 కోట్ల అంచనాతో నాడు–నేడు పనులు
- స్కూళ్లతోపాటు అంగన్‌వాడీ, కళాశాలలకు సమకూరుతున్న వసతులు
- హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీలకే పనుల పర్యవేక్షణ



బద్వేల్ జెడ్పీ హైస్కూల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

కడప ఎడ్యుకేషన్: పభుత్వ పాఠశాలలంటే ఒకనాడు చిన్నచూపు. సరిపడా లేని తరగతి గదులు, పెచ్చులూడుతున్న పై కప్పులు, చెట్ల కింద చదువులు. ఇప్పుడు పరిస్థితి మారింది. కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు సమకూరాయి. రంగరంగుల తరగతి గదులు, స్మార్ట్‌టీవీలతో బోధన, విద్యార్థులకు సరిపడా ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, ప్రహరీలు, శుద్ధనీరు. గ్రీన్‌చాక్‌బోర్డు, ఇంగ్లీషుల్యాబ్స్ లతో కళకళలాడుతున్నాయి. మౌలిక వసతుల కల్పనను పాఠశాలలతో సరిపెట్టకుండా మరో అడుగు ముందుకేసి రెండో విడత నాడు– నేడు పనులను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కూడా మంజూరు చేశారు.రూ. 296.89 కోట్ల నిధులతో పనులను చేపట్టారు. పనులు జిల్లాలో ముమ్మరంగా జరుగుతున్నాయి.

రెండవ విడతలో...

జిల్లావ్యాప్తంగా రెండోవిడత కింద 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూల్స్, 9 జూనియర్ కళాశాలలు మొత్తం 1005 వాటిల్లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. వీటిలో నాడు - నేడు కింద తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్‌చాక్‌బోర్డు, కిచెన్‌షెడ్డు, ఇంగ్లీషుల్యాబ్, తదితర పనులు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 296.62 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు రూ. 108.15 కోట్లు నిధులను ఖర్చు చేశారు. పెరెంట్ కమిటీ, విద్యాశాఖ ద్వారా దాదాపు 90 శాతం మేర పనులు పూర్తి చేశారు. అక్టోబర్ చివరినాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.

ఐదు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్లతో పనులు...

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన నాడు- నేడు పనులను ఐదు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఇందులో 108 స్కూళ్లలో పంచాయితీరాజ్(పీఆర్), మరో 169 పాఠశాలల్లో సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), మరో 193 స్కూళ్లలో పబ్లిక్ హెల్త్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్(పీహెచ్ఈడీ), 218 పాఠశాలల్లో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఈడబ్ల్యూఐడీసీ), మరో 317 స్కూళ్లలో రూరల్ వాటర్ సర్వీస్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్(ఆర్‌డబ్ల్యూఎస్) వారు నిధులు ఖర్చు చేసి పనులను చేస్తున్నారు. సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు జిల్లాలో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు.

కేటగిరి	సంఖ్య	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	ఖర్చు చేసినది (రూ.లక్షల్లో)	మెటీరియల్ ఖర్చు (రూ.లక్షల్లో)	మొత్తం ఖర్చు (రూ.లక్షల్లో)
ఏడబ్ల్యూసీ	87	1385.47	351.95	79.31	431.26
ప్రైమరీ	637	9826.26	2906.14	739.32	3645.46
యూపీ	75	1591.40	507.61	117.68	625.29
హైస్కూల్స్	197	16153.51	4569.54	1225.09	5794.63
కాలేజీలు	09	709.25	288. 04	31.11	319.15

రెండోవిడతలో చేపట్టనున్న అభివృద్ధి పనులు

1 తాగునీటి సరఫరా
2. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు
3. మేజర్, మైనర్ మరమ్మతులు
4. లైట్లు, ఫ్యాన్లతో సహా విద్యుద్దీకరణ
5. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్
6. తరగతి గదులకు పెయింటింగ్
7. గ్రీన్ చాక్ బోర్డులు
8. వంటగది నిర్మాణం
9. ప్రహరీలు
10. అదనపు తరగతి గదుల నిర్మాణం

అక్టోబర్ నాటికి పనుల పూర్తికి చర్యలు



జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు- నేడు పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. నాణ్యతలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పర్యవేక్షిస్తున్నాం. - అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి

సంపూర్ణ పోషణతో భావితరాలకు ఆరోగ్యం

జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం వల్ల భావితరాలకు ఆరోగ్యం చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని 27,603 మంది గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 2389 అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అమృతతుల్యమైన పోషణ అందనుందన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపాలను అధిగమించేలా పోషక విలువలతోకూడిన కిట్‌ను ప్రతినెల మొదటి వారంలో అందజేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో భోజనం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, పావుకిలో వేరుశనగ చిక్కీలు, అరకిలో ఖర్జూరం, రెండో విడతగా 12 కోడిగుడ్లు, రెండవ విడతగా 2.5 లీటర్ల పాలు అందజేస్తున్నామని వివరించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ఆర్‌జేడీ పద్మజ, పీడీ శ్రీలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ వై.హిమదేవి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న అధికారులు

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్‌హుస్సేన్ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 2 నుంచి 17వ వరకు ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కనీస విద్యార్హత 10వతరగతి పాసై ఉండాలన్నారు.40 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన స్త్రీ,పురుషులు మైనార్టీలు, ఇతర కులాలు అర్హులన్నారు. ఇందులో మైనార్టీలకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు 9966319199 నంబరులో సంప్రదించాలన్నారు.

నగర వనం..ఆహ్లాదభరితం



కడప నగరవనంలో ఐలవ్ కడప ఫారెస్ట్ నేమ్ బోర్డు



గువ్వల చెరువు ఘాట్‌లో అరణ్య

త్వరలో జమ్మలమడుగు, బద్వేల్, ప్రొద్దుటూరులో 'నగర వనాలు'

కడప అర్బన్: జిల్లాలో అటవీశాఖవారు పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. కడప డివిజనల్ ఫారెస్ట్ వారి ఆధ్వర్యంలో పాలకొండలు రిజర్వ్ ఫారెస్ట్ పక్కన 185 హెక్టార్ల విస్తీర్ణంలో 'కడప నగర వనం'ను 2019 జనవరి 25న ప్రారంభించారు. ఈనెల 9న జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల టౌన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 'గ్రీన్‌కో'ఆధ్వర్యంలో 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 'సిటీ ఫారెస్ట్'(రాణితోపు)ను లాంఛనంగా ప్రారంభించారు.ప్రొద్దుటూరులో ఎర్రగుంట్ల రోడ్డులో 'నగరవనం'కోసం స్థలాన్ని కేటాయించారు.బద్వేల్, జమ్మలమడుగు పట్టణాలలో కూడా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు.

- కడప నగరవనాన్ని 185 హెక్టార్లలో రూ. 2కోట్ల నుంచి రూ. 4 కోట్ల వ్యయంతో 2019 జనవరి 25న ప్రారంభించారు. ఇక్కడ కెఫ్టేరియా, పగోడాస్, సైక్లింగ్, గ్రీన్ గార్డెన్, 'ఐ లవ్‌యు ఫారెస్ట్ నామ బోర్డ్', ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, షటిల్, వాలీబాల్ కోర్టులు, సిట్టింగ్ బెంచెస్, చిల్డ్రన్ పాలీ ఏరియా, ఓపెన్ ఎయిర్ జిమ్ సెంటర్, వాకింగ్ పాత్, వీక్లీ ట్రెక్ ప్రోగ్రాం, రాబోవు రోజుల్లో గుర్రపు సవారీ వంటివి సౌకర్యాలు కల్పించారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ప్రవేశం వుంటుంది. పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 20, పిల్లలకు రూ. 10 ప్రవేశరుసుం చెల్లించాల్సి వుంటుంది. సెలవురోజుల్లో 'శిల్పారామం'కు ధీటుగా 'కడప నగర వనం'కు విశేషంగా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.
- పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్ట్– పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణీతోపు)ను 30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 16.81 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో ఎంట్రీ ప్లాజా, మార్కెట్ బ్లాక్, పాత్‌వే, పార్కింగ్ ఏరియా, స్టోన్ గజెబో, అందమైన శిల్పాలు, ఆహ్లాదకరమైన గ్రీనరీతో అభివృద్ధి చేస్తున్నారు.
- గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో.. ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను రూ. 30 లక్షల వ్యయంతో 'అరణ్య'పేరుతో అభివృద్ధి చేపట్టారు. కేఫ్టేరియా, చిల్డ్రన్ పార్క్ వంటి పనులు జరుగుతున్నాయి.

నగర వనాల అభివృద్ధికి కృషి



జిల్లాలో నగర వనాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో కృషి చేస్తున్నాం. కడప నగర శివార్లలోని 'కడప నగరవనం'లో ఇటీవలనే 'వీక్లీ ట్రెక్కింగ్'కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఆసక్తి కలిగిన ప్రజలు పాల్గొనే అవకాశం కల్పించాం. – పి.వి సందీప్‌రెడ్డి, డిఎఫ్ఓ, వైఎస్ఆర్ జిల్లా

నందలూరు క్రూ సెంటర్‌ను తరలించొద్దు

రైల్వేబోర్డు చైర్మన్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి వినతి



రైల్వేబోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి

రాజంపేట: వైఎస్సార్ ఉమ్మడి జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో శతాబ్ది కాలం నాటి రన్నింగ్ క్రూసెంటర్‌ను తరలించకుండా బలోపేతం చేయాలని రాజంపేట లోక్‌సభసభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ పీవీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లహోటీని కోరారు. ఈ మేరకు బుధవారం రైల్వేబోర్డు చైర్మన్‌తో ఎంపీ భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వ్యవస్థ ఆవిర్భావకాలంలోనే నందలూరులో రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ కొనసాగిందన్నారు. అన్ని ప్యాసింజర్, గూడ్స్‌రైళ్లకు ఇక్కడే క్రూ సిస్టమ్ కొనసాగిందని గుర్తుచేశారు. మళ్లీ గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల క్రూ సౌకర్యం పునరుద్ధరించాలని విన్నవించారు. వేరే ప్రాంతానికి క్రూసెంటర్‌ను తరలించరాదన్నారు. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఎత్తివేసిన తర్వాత ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పుకొచ్చారు. నందలూరులో వందలాది క్వార్టర్స్, పుష్కలంగా మంచినీటి సౌకర్యం ఉందన్నారు. ఇక్కడ పలు రైళ్లకు వాటరింగ్ సౌకర్యం కల్పించుకోవచ్చునన్నారు. 240 ఎకరాలకుపైగా రైల్వే స్థలాలు ఉన్నాయని, వాటిని ఆదాయవనరుగా మార్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.

- రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, ఓబులవారిపల్లెలో కోవిడ్ ముందు ఏవిధంగా రైళ్ల హాల్టింగ్ కొనసాగిందో, అదే విధంగా హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. బుధవారం రైల్వేమంత్రితో ఎంపీ భేటీఅయ్యారు.

క్లుప్తంగా

వేంపల్లెలో పేలిన ఐపీ బాంబు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న ఓ చికెన్‌ సెంటర్‌ నిర్వాహకుడు కోటి రూపాయల వరకు అప్పు చేసి ఐపీ బాంబు పేల్చాడు. బాధితుల వివరాల మేరకు సుమారు 38మందికి సంబంధించి కోటి రూపాయల మేర నోటీసులు పంపారు. బాధితులకు ఒక్కసారిగా నోటీసులు రావడంతో అవాక్కయ్యారు. కష్టపడి సంపాదించుకున్న సంపదను కొంత మేర వడ్డీ వస్తుందనే ఆశతో ఆ వ్యాపారికి అప్పు ఇచ్చామని, ఉన్నఫలంగా తమకు కోర్టు ద్వారా నోటీసులు రావడం శోచనీయమన్నారు. వచ్చే నెల సెప్టెంబర్‌ 5న కోర్టుకు హాజరు కావాలని నోటీసులు అందాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వాల్టాను ఉల్టా చేస్తున్న టీడీపీ నేత

– సీజ్‌ చేసిన బోరును ఆడిస్తున్న వైనం



సీజ్‌ చేసిన బోరును ఆడిస్తున్న దృశ్యం

కలసపాడు : మండలంలోని సిద్దమూర్తిపల్లెలో టీడీపీ కార్యకర్త మారంరెడ్డి నడిపిసిద్దారెడ్డి వాల్టాకు విరుద్ధంగా 2022 మార్చి 15న ప్రభుత్వ స్థలంలో బోరు వేశారు. అప్పట్లో అదే గ్రామానికి చెందిన రైతు పాలకొలనుదశరథ రామిరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు, పోలీసులు నడిపిసిద్దారెడ్డిపై కేసు నమోదు చేసి బోరును సీజ్‌ చేశారు. అయితే ఇటీవల టీడీపీ కార్యకర్త నడిపి సిద్దారెడ్డి సీజ్‌ చేసిన బోరును మళ్లీ ఆడిస్తున్నాడు. టీడీపీ కార్యకర్త తన తీరును మార్చుకోకుండా సీజ్‌ చేసిన బోరును ఆడిస్తుండటం వెనుక అధికారులు ఉన్నట్లు సమాచారం. రైతు దశరథ రామిరెడ్డి తనకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని రైతు కోరాడు.

దేశానికే ఆదర్శంగా జగన్‌ పథకాలు

- బాబుకు ప్రాజెక్టులతో సంబంధం లేదు
- ఏపీ ప్రెస్‌ అకాడమి చైర్మన్‌ కొమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రెస్‌ అకాడమి చైర్మన్‌ కొమ్మినేని శ్రీనివాసరావు

కడప సెవెన్‌రోడ్స్‌ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఏపీ ప్రెస్‌ అకాడమి చైర్మన్‌ కొమ్మినేని శ్రీనివాసరావు కొనియాడారు. వైఎస్సార్‌ ఇంటలెక్చువల్‌ ఫోరం రాయలసీమ కన్వీనర్‌ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ రూపాంతరం' అంశంపై బుధవారం కడపలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను తమిళనాడు ప్రభుత్వం కూడా అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్న కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఇలాంటి వ్యవస్థనే తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. హర్యాన కూడా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఏపీలోలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నారనడానికి ఇవి ఉదాహరణలన్నారు. పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టగా తీవ్రంగా వ్యతిరేకించిన వారే తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చదివిస్తున్నారని విమర్శించారు. జగన్‌ ప్రభుత్వంపై కసి, ద్వేషంతో కొన్ని పత్రికలు విషం కక్కుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బాబుకు ఇరిగేషన్‌ ప్రాజెక్టులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పోలవరం, పులిచింతలను చంద్రబాబును పూర్తిగా పట్టించుకోలేదని, వైఎస్‌ రాజశేఖరరెడ్డి వచ్చాక ఆ ప్రాజెక్టులను నిర్మించి చూపారన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శిస్తున్న చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే అంతకుమించి అమలు చేస్తానంటూ ప్రజలను మభ్యపెట్టే మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని మాట్లాడటంలో ఏమాత్రం వాస్తవం లేదన్నా రు. శ్రీసిటీ, కొప్పర్తి పారిశ్రామికవాడ, పలు పోర్టులు జగన్‌ హయాంలో చేపట్టారని తెలిపారు.వైఎస్సార్‌ ఇంటలెక్చువల్‌ ఫోరం రాయలసీమ కన్వీనర్‌ చిన్నపరెడ్డి మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాలపై పెట్టే పెట్టుబడులు వృథా పోదని, అది అభివృద్ధికి దారి తీస్తుందని విశ్లేషించారు. అభివృద్ధి, సంక్షేమం వేర్వేరు కాదని చెప్పారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శాంతమూర్తి తమ సంఘం చేపట్టిన కార్యక్రమాల గురించి నివేదిక సమర్పించారు. మానవత్వం పరిశీలన దృష్టి నాయకత్వ లక్షణాలుగా పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గతాన్ని అంచనా వేసుకుని ఇప్పటి సీఎం పాలన బేరీజు వేసుకోవాలని సూచించారు. ఫోర్త్‌ ఎస్టేట్‌గా కాకుండా పొలిటికల్‌ ఎస్టేట్‌గా మారిన కొన్ని పత్రికలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విమర్శించడం అన్యాయమన్నారు. అధికారభాషా సంఘం సభ్యులు త వ్వా వెంకటయ్య మాట్లాడుతూ 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు రోడ్‌షో నిర్వహించాల్సింది పులివెందులలో కాదని, కుప్పంలో నిర్వహించాలని ఎద్దే వా చేశారు. సచివాలయాల వల్ల సుపరిపాలన వచ్చిందని తెలిపారు. ఫోరం నాయకురాలు రత్నకుమారి తదితరులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

పత్రికా స్వేచ్ఛ పేరిట ఇష్టానుసారం రాతలు

కడప సెవెన్‌రోడ్స్‌ : పత్రికా స్వేచ్ఛ పేరిట కొన్ని పత్రికలు, ఛానళ్లు ఇష్టానుసారంగా వార్తలు ఇస్తున్నారని ఏపీ ప్రెస్‌ అకాడమి చైర్మన్‌ కొమ్మినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం కడపలో పాత్రికేయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ను ఓవైపు దూషిస్తూనే రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ లేదని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, నిజాలు రాయకుండా అబద్ధాలను ప్రచారం చేయడం మాత్రం అభ్యంతరకరమన్నారు. దేశంలో ఎక్కడా లేని పత్రికా స్వేచ్ఛ మన రాష్ట్రంలోనే ఉందన్నారు. రాజకీయ పార్టీలకు పత్రికలు ఉండటం, అనుకూలంగా వార్తలు రాయడం తప్పుకాదని చెప్పారు. అయితే అక్కసుతో అబద్ధాలు రాయడం తగదన్నారు. పరిధి దాటి వార్తలు రాయడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో వరదలు వస్తే ఒక రకంగా, ఆంధ్రప్రదేశ్‌లో వరదలు వస్తే మరో రకంగా వార్తలు రాస్తున్నారన్నారు. ప్రెస్‌ అకాడమి ఆన్‌లైన్‌ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తోందన్నారు. ప్రతి శనివారం నిష్ణాతులైన వారితో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జర్నలిస్టుల రచనలను ప్రోత్సహించాలని గ్రంథాలయ పరిషత్‌ను కోరగా, వారు అంగీకరించారని తెలిపారు. కరోనా సమయంలో మృతి చెందిన జర్నలిస్టులకు పరిహారం అందించే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతామని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం!



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రావు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్టీసీ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్‌రావు అన్నారు. బుధవారం కడప నగరంలోని ఎంప్లాయీస్‌ యూనియన్‌ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బోస్‌ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం తర్వాత కార్మికులు ఏపీపీటీడీ ఉద్యోగులుగా మారారన్నారు. ఆ తర్వాత 11వ పీఆర్సీ అమలు జరిగిన అనంతరం క్యాడర్ల వారీగా వచ్చిన ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తామని ఆర్టీసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ద్వారక తిరుమలరావు ఉద్యోగ సంఘాల సమావేశంలో హామీ ఇచ్చారన్నారు. త్వరలో ఈ క్యాడర్ల వారీగా ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేస్తామని, ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీ పీటీడీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న లీవ్‌ ఎన్‌క్యాష్‌మెంట్‌ సెప్టెంబరు నెలాఖరులోగా చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, కడప జోనల్‌ అధ్యక్షులు కేకే కుమార్‌, జోనల్‌ కార్యదర్శి రాజశేఖర్‌, నాయకులు అంకిరెడ్డి, రంగనాథ్‌, ప్రమీల, పీవీ నారాయణ, పీఎస్‌వీ రెడ్డి, పద్మనాభరెడ్డి జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మల్లికార్జునతోపాటు జిల్లాలోని అన్ని డిపో, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఇటీవల బస్సు ప్రమాదంలో గాయపడిన డిపో ఎంప్లాయిస్‌ యూనియన్‌ సెక్రటరీ బాల వెంకటేశ్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు.

నేటి నుంచి బ్యాడ్మింటన్‌ సంబరం

- కడప వేదికగా రాష్ట్రస్థాయి సీనియర్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు



బ్యాడ్మింటన్‌ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులతో బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్‌: కడప నగరం వేదికగా మరో క్రీడాసంబరానికి తెరలేవనుంది. కడప నగరం పకీర్‌పల్లెలోని పి.వి.ఆర్‌. స్పోర్ట్స్‌ ఎరీనా వేదికగా ఈనెల 3వ తేదీ గురు వారం నుంచి 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌ సీనియర్‌ బ్యాడ్మింటన్‌ ఛాంపియన్‌షిప్‌ నిర్వహించనున్నా రు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు, వస తి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్‌ సంఘం ప్రతినిధులు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న నేషనల్‌ గేమ్స్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు అర్హత సాధించేందుకు ఈ టోర్నమెంట్‌ కీలకమైందని జిల్లా బ్యాడ్మింటన్‌ సంఘం చైర్మన్‌, టోర్నమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ ఎస్‌. జిలానీబాషా తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్‌ సంఘం అధ్యక్షుడు సింగం భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పి.వి.ఆర్‌. స్పోర్ట్స్‌ ఎరీనా అధినేత విశ్వనాథ్‌రెడ్డి సహకారంతో టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు..

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌ పోటీలను ఉప ముఖ్యమంత్రి ఎస్‌.బి. అంజద్‌బాషా,మేయర్‌ కె. సురేష్‌బాబు విచ్చేసి గురువారం ఉదయం టోర్నమెంట్‌ ప్రారంభించనున్నారు. పోటీలను ఏపీ బ్యాడ్మింటన్‌ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ద్వారకనాథ్‌, అంకమ్మచౌదరి, నేషనల్‌ రెఫరీ రామకృష్ణ పర్యవేక్షిస్తారని జిలానీబాషా తెలిపారు. గురువారం నిర్వహించనున్న టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు స్టేడియంలో సాధన చేశారు. కాగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్‌ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నేషనల్‌ రెఫరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌

సెంట్రల్‌ జోన్‌ జట్టుకు ఆధిక్యం



తలపడుతున్న సెంట్రల్‌జోన్‌, నార్త్‌జోన్‌ జట్లు



102 పరుగులు చేసిన తాఫిక్‌



5 వికెట్లు తీసిన నార్త్‌ జోన్‌ బౌలర్‌ అచ్యుత్‌

కడప స్పోర్ట్స్‌ : కడప నగరంలోని వైఎస్‌ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్‌ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్‌-19 అంతర్‌ జిల్లాల జోన్‌ మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. సెంట్రల్‌జోన్‌, నార్త్‌జోన్‌ జట్ల మధ్య నిర్వహిస్తున్న మ్యాచ్‌లో మూడోరోజు బుధవారం 170 పరుగుల ఓవర్‌నైట్‌ స్కోరుతో బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్‌ జట్టు 129.2 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 481 పరుగులు చేసింది. జట్టులోని ఎస్‌.కె. తాఫిక్‌ 102 పరుగులు చేశాడు. నార్త్‌జోన్‌ బౌలర్‌ అచ్యుత్‌ హేమంత్‌కుమార్‌ 5 వికెట్లు తీశాడు. మ్యాచ్‌ ఫలితం తేలకుండా డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్‌ జట్టు 457 పరుగులు చేయగా, సెంట్రల్‌జోన్‌ జట్టు 481 పరుగులు చేసింది. దీంతో సెంట్రల్‌ జోన్‌ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 24 పరుగుల ఆధిక్యం లభించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఖాజాపీర్‌

మైదుకూరు : పట్టణంలోని మైదుకూరు-వనిపెంట రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మైదుకూరుకు చెందిన షేక్‌ ఖాజాపీర్‌, వీరయ్య అనే వారు స్థానిక వనిపెంట రోడ్డులోని ఎర్రచెరువు సమీపంలో ఉన్న ఓ మెకానిక్‌ షెడ్‌ వద్దకు వెళ్లి మంగళవారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వనిపెంట వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొంది. సంఘటనలో ఖాజాపీర్‌, వీరయ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరికి మైదుకూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కడపకు తరలించారు. ఖాజాపీర్‌ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత పొందుతూ కోమాలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనపై అర్బన్‌ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం



అర్ధరాత్రి రోడ్డుపై ఆగిపోయిన బస్సు



బస్సుకు డీజిల్‌ పడుతున్న దృశ్యం

- కడప-బీహెచ్‌ఈఎల్‌ సర్వీస్‌ షాద్‌నగర్‌ వద్ద బ్రేక్‌
- డీజిల్‌ లేక ఆగిపోయిన బస్సు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నుంచి హైదరాబాదు మీదుగా బీహెచ్‌ఈఎల్‌ (6031) సర్వీసు మంగళవారం రాత్రి 8.40 గంటలకు కడప నుంచి బయలుదేరింది. బస్సు గ్యారేజీలో నుంచి బయటికి వచ్చినపుడు గ్యారేజ్‌ సిబ్బంది ఫిట్‌నెస్‌ కరెక్టుగా ఉందని పంపించారు. ఇక బస్సులోని డ్రైవర్లు బస్సు తీసుకుని బయలుదేరారు. కర్నూలు, జడ్చర్ల దాటిన తర్వాత 3.40 గంటలకు షాద్‌నగర్‌కు 16 కిలోమీటర్ల దూరంలో ఓ పెట్రోలు బంకు సమీపంలో బస్సు నిలిచిపోయింది. తీరా చూసుకుంటే బస్సులో డీజిల్‌ పట్టలేదని డ్రైవర్లు నిర్ధారించుకున్నారు. అర్ధరాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో ఏ బస్సులు కూడా నిలబడలేదు. చివరికి టికెట్ల ద్వారా వచ్చిన నగదుతో పాటు ఓ ప్రయాణికుడి వద్ద కొంచెం డబ్బులు తీసుకుని బస్సు గమ్య స్థానానికి చేరేలా సమీపంలోని పెట్రోలు బంకు వద్ద డీజిల్‌ పట్టించుకున్నారు. దాదా పు గంటకుపైగా బస్సు నిలబడి పోయింది. విషయం తెలిసిన ప్రయాణికులు అధికారులు తీరుపై మండిపడ్డారు. కాగా బస్సు ఉదయం 9 గంటలకు బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంది. ఇలాంటి ఘటనలు గతంలో కడప డిపోలో విజయవాడ, బెంగుళూరు, హైదరాబాదు సర్వీసులకు కూడా ఎదురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు బస్సులు బయటికి పంపేటపుడు అన్ని విధాల పరిశీలించి బస్సులను పంపించాలని ప్రయాణికులు సూచించారు.

మహిళల రక్షణపై పాలకులకు చిత్తశుద్ధి కరువు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణపై ప్రకటనల్లో కాదని చేతల్లో చూపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. హింసపై మహిళల పోరు యాత్రలో భాగంగా బస్సు యాత్ర బుధవారం రాత్రి ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా పుట్టపర్తి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ బిల్‌కిస్‌ భానోను పలువురు అత్యాచారం చేస్తే ఆమె ధైర్యంగా పోరాడిందన్నారు. ఫలితంగా నేరస్తులకు శిక్ష పడిందని, ఇప్పటి పాలకుల వివక్షత కారణంగా నేరస్తులను బయటకు వదిలేశారన్నారు. మణిపూర్‌ సంఘటనలో ప్రధాని సిగ్గుపడటం మనకు అవసరం లేదని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌ మహిళల అత్యాచారాల్లో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చిన మేరకు మద్య నిషేధం చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన ఒక భిక్షగత్తెపై సామూహిక అత్యాచారం జరిగితే ఇక్కడి మహిళా సంఘం బాధితురాలికి అండగా నిలిచిందన్నారు. ఈనెల 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభకు మహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు సావిత్రి, జిల్లా కార్యదర్శి ఎస్‌.ముంతాజ్‌ బేగం, అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ విజయకుమార్‌, మున్సిపల్‌ వర్కర్స్‌, ఎంప్లాయిస్‌ యూనియన్‌ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవలు మహనీయులు



పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌



పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్‌, బ్రౌన్‌ కేంద్రం బాధ్యులు, సిబ్బంది

కడప అర్బన్‌ : జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి వెంకయ్య, తెలుగు నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ మహనీయులని ఎస్పీ అన్బురాజన్‌ కొనియాడారు. ఆ మహనీయుల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ బుధవారం జిల్లా పోలీస్‌ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్‌. అదనపు ఎస్పీ ఎస్‌.ఎస్‌.ఎస్‌.వి కృష్ణారావు, ఏఆర్‌ డీఎస్పీ రమణయ్య, ఆర్‌ఐలు సోమశేఖర్‌ నాయక్‌, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌, పోలీసు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో..

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయంలో భారత స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌ చాన్సలర్‌ ఆచార్య బి. అంజనేయప్రసాద్‌ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ రిజిస్ట్రార్‌ రాజేష్‌ కుమార్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్లు ఉదయప్రకాష్‌రెడ్డి, రమాదేవి, ఉషా మాధురీ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌ లైబ్రరీలో..

కడప కల్చరల్‌ : భారతదేశం జాతీయ పతాకాన్ని రూపొందించి అజరామర కీర్తి పొందిన దేశభక్తుడు పింగళి వెంకయ్య అని, నాటకరంగంలో రారాజుగా పేరుగాంచిన బళ్లారి రాఘవ మహనీయుడని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్‌ అన్నారు. బుధవారం వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో బళ్లారి రాఘవయ్య ,పింగళి వెంకయ్య జయంతులను కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారిద్దరి చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. రిజిస్ట్రార్‌ వెంకట సుబ్బయ్య, బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్‌ మాట్లాడారు. బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు , గ్రంథ పాలకులు పాల్గొన్నారు.

ముగ్గురి సస్పెన్షన్‌

ఒక హెడ్‌టీచర్‌తోపాటు ఎస్‌ఎస్‌ఏ ఇంజినీరు, సచివాలయ గ్రేడ్‌-2 ఇంజినీరు

కడప ఎడ్యుకేషన్‌ : చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లె ఉర్దూ ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల స్కూల్‌ గేట్‌ మీదపడి విద్యార్థి మృతి చెందిన సంఘటనలో ముగ్గుర్ని సస్పెండ్‌ చేస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పాఠశాల హెడ్‌ టీచర్‌తోపాటు పీఆర్‌ ఇంజనీరు, ఇప్పెంట సచివాలయంలో గ్రేడ్‌-2గా ఇంజనీరింగ్‌ అసిస్టెంట్‌గా ఉన్నారు. బోడెద్దులపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు పనుల్లో భాగంగా పాఠశాలకు ప్రధాన ద్వారానికి గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ గేటును సరిగా ఏర్పాటు చేయని కారణంగా మూడు రోజుల క్రితం అదే పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్‌ అయాూమ్‌ మీద పడింది. తీవ్రగాయాల పాలై తిరుపతిలో చికిత్స పొందుతూ ఆ బాలిక బుధవారం మృతి చెందింది. ఇందుకుగాను ఆ పాఠశాలలో గతంలో హెడ్‌ టీచర్‌గా పనిచేసిన నజీర్‌ను (ప్రస్తుతం ఆయన మైదుకూరు ఉర్దూ స్కూల్లో పని చేస్తున్నారు) డీఈఓ రాఘవరెడ్డి సస్పెండ్‌ చేశారు. అలాగే సమగ్రశిక్ష ఇంజనీర్‌గా పనిచేస్తున్న గుప్తాను, ఇప్పెంట్‌ సచివాలయంలో గ్రేడ్‌-2 ఇంజనీరింగ్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకళను పంచాయతీరాజ్‌ సూపరింటెండెంట్‌ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి సస్పెండ్‌ చేశారు.